క్లుప్తంగా

బీసీ హాస్టల్ తనిఖీ



హాస్టల్‌లో విద్యార్థులతో సమావేశమైన డీడీ శివరంగప్రసాద్

పరిగి: మండల కేంద్రంలోని పరిగిలో బీసీ హాస్టల్‌ను ఆదివారం సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ శివరంగప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హిందూపురం పర్యటనలో భాగంగా ఆయన పరిగికి వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా కానుక కిట్లతో పాటూ ఇతరత్ర పథకాలు అందాయా అని ఆరాతీశారు. అదేవిధంగా హాస్టల్లో ఉన్న మౌలిక వసతులు, తాగునీరు, భోజనం తదితర విషయాలను ప్రతి విద్యార్థితో అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వార్డెన్ వీరనారాయణను అభినందించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అగళి: మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రేణుక అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ హాజరు కావాలని కోరారు. మండలానికి చెందిన ఆయా శాఖల అధికారులు నివేదికలను హాజరు కావాలని సూచించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో పాక్షికంగా దెబ్బతిన్న కారు

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారి హరిపురం వై జంక్షన్ వద్ద ఆదివారం మూడు కార్లు ఢీ కొన్నాయి. స్థానికుల వివరాలమేరకు బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కారు హరిపురం వై జంక్షన్ స్పీడు బ్రేకర్ల వద్దకు రాగానే డ్రైవర్ వేగాన్ని నియంత్రించాడు. అదే క్రమంలో విజయవాడ వెళ్తున్న మరో కారు, ఆ వెంటనే మరోకారు ఒకదాని వెనుక మరోటి ఢీ కొన్నాయి. అయితే ఎవరికి ఎలాంటి గాయాలు జరగకపోవడంతో ప్రమాదం తప్పింది.

వీరభద్రుని ఆలయంలో ప్రత్యేక పూజలు

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా దుర్గాదేవికి, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన సత్రం వద్దకు వెళ్లి పర్యాటకులకు, భక్తులకు భోజనం వడ్డించారు. అలాగే లేపాక్షికి చెందిన బాబ్‌జాన్ అనే వ్యక్తికి వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు.

కన్నడ భాషాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కసాప అధ్యక్షుడు నరసింహమూర్తి

పావగడ: భాషతోనే సంస్కృతిని పెంచాల్సిన అవసరముందని స్థానిక కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి తెలిపారు. కన్నడ జాగృతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కన్నడ నాడును రక్షించాలంటే మొదట మనం కన్నడ ప్రీతిని పెంచాలన్నారు. తాలూకాలో 103 పాఠశాలలు, కళాశాలల్లో ఉపన్యాసాలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో కన్నడ భాషపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

రహదారిపైనే పంట నూర్పిడి



నాగలూరు సమీపంలో బ్రిడ్జి వద్ద పంట నూర్పిడి చేపట్టిన దృశ్యం

పెనుకొండ రూరల్: కొందరు రైతులు రహదారిపైనే పంట నూర్పిడి పనులు చేస్తుండటం వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. మండలంలోని మావటూరు నుంచి బండ్లపల్లి మీదుగా నాగలూరు సమీపంలో రహదారిపై కొందరు రైతులు పంట నూర్పిడి పనులు చేపట్టారు. సింగిల్ లైన్ రహదారి కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రమాదం పొంచి ఉందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి రోడ్డుపై పంట నూర్పిడి చేయకుండా చూడాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో 'రత్నగిరి'

చారిత్రక ప్రదేశమైన 'రత్నగిరి' శిథిలావస్థకు చేరుకుంది. గుప్త నిధుల కోసం స్వార్థపరులు ఓవైపు తవ్వకాలు సాగిస్తుంటే... పరిరక్షించాల్సిన కేంద్ర పురావస్తు అధికారులు చోద్యం చూస్తుండటంతో చరిత్ర మట్టిలో కలసిపోతోంది.

- ఉమ్మడి జిల్లాలోనే పర్యాటక కేంద్రంగా గుర్తింపు
- గుప్త నిధుల కోసం పురాతన కట్టడాల ధ్వంసం
- పట్టించుకోని కేంద్ర పురావస్తుశాఖ అధికారులు



దుండగుల చేతిలో ధ్వంసమైన నేతికొనేరు బావి



బురుజు కట్టడాలు కూలిపోయిన దృశ్యం

రొళ్ల: మండల కేంద్రానికి ఐదు కిలో మీటర్ల దూరం ఉన్న 'రత్నగిరి' ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంచి పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. కొండను ఆనుకుని వందల ఏళ్లనాటి చరిత్ర ఉన్న రత్నగిరి గ్రామం కూడా ఉంది. గ్రామం సరిహద్దు రక్షణగా చుట్టూ ఎత్తైన బురుజు కూడా అప్పట్లో నిర్మించారు. ఈ గ్రామంలో నేటికీ అలనాటి కళ్యాణి బావులు, బురుజులు, రాతి ఏనుగులు, అంతఃపురం, ఇంద్రసేన కోట, మంటపాలు, బంగిమలు, పురాతన కట్టడాలు, గోపురాలు, జైన దేవాలయం ఇలా ఎన్నో చారిత్రక కట్టడాలు ఉన్నాయి.

గుప్త నిధుల కోసం ధ్వంసం

ఎన్నో చారిత్రక కట్టడాలు ఉన్న రత్నగిరి గ్రామం కేంద్ర పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇటీవల రత్నగిరి కొండ (శిఖరాన) పై భాగాన గంట ఆకారంలో ఉన్న నేతి కొనేరు రాతి బావి (అలనాటి కోనేరు సరస్సు)ను గుర్తు తెలియని దుండగులు గుప్త నిధులు ఉంటాయని ఆశతో బావిని ధ్వంసం చేశారు. దీనికి తోడు కొండ పైకి ఎక్కడానికి ఏడు కోటలు దాటి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ఐదారు చోట్ల కోట కట్టడాలు కూడా కూలిపోవడంతో పర్యాటకులు వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా మారింది. కొండ కింద భాగంలో ఆనుకొని గ్రామం ఉంది. గ్రామం చుట్టు కంచె మాదిరిగా ఎత్తైన బురుజు కూడా ఉంది. అది కూడా పది, పన్నెండు చోట్ల రాతి కట్టడాలు కూలి రోడ్డుపైకి పెద్ద పెద్ద రాళ్లు పడ్డాయి. రాత్రి వేళల్లో తిరగడానికి కూడా ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామం ముఖ ద్వారం కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికైన కేంద్ర పురావస్తుశాఖ అధికారులు పురాతన కట్టడాలు ధ్వంసం కాకుండా నిఘా పెట్టాలని, అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, కట్టడాలను తిరిగి యథావిధిగా నిర్మించాలని ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.

కోరిన కోర్కెలు దీర్చే దైవం మహాలక్ష్మి



కోరిన కోర్కెలు దీర్చే దైవంగా రత్నగిరిలో వెలసిన కొల్లాపురి మహాలక్ష్మి అమ్మవారికి పేరు ఉంది. 628 ఏళ్ల క్రితం చౌళరాజుల వంశానికి చెందిన రత్నగిరి సంస్థానం మహారాజు అయిన క్రిష్టప్పరాజు ఆధ్వర్యంలో పుట్టమట్టితో కొల్హాపురి మహాలక్ష్మి విగ్రహాన్ని తయారు చేశారు. విగ్రహంతో పాటు పాలబావిని కూడా ఒకేరోజులో నిర్మించారట. మహాలక్ష్మి ఆలయంలో విశేష పూజ రోజు అయిన మంగళ, శుక్రవారం రోజున పూలతో అమ్మవారిని అలంకరించిన తర్వాత కుడి వైపు పూలు రాలితే మంచిది జరుగుతుందని, ఎడమ వైపు రాలితే అనుకొన్న కార్యం జరగదని భక్తులు నమ్మకం. ప్రతి వారం వందలాది మంది భక్తులు ఆలయానికి తరలివస్తుంటారు.

కట్టడాలు యథావిధిగా నిర్మించాలి



రత్నగిరిలో శిథిలావస్థకు చేరిక పురాతన చారిత్రక కట్టడాలు యథావిధిగా నిర్మించాలి. ఇటీవల గుర్తు తెలియని దుండగులు కొండపై భాగాన గల నేతికొనేరు రాతి భావిని ధ్వంసం చేశారు. దీనికితోడు గ్రామం చుట్టూ ఉన్న ఎత్తైన బురుజు కూడా కొన్ని చోట్ల కూలి రోడ్డు పైకి రాతి కట్టడాలు పడ్డాయి. కేంద్ర పురావస్తుశాఖ అధికారులు చర్యలు తీసుకొని అభివృద్ధికి కృషి చేయాలి.

– చిన్నరంగప్ప, సర్పంచ్, రత్నగిరి

రత్నగిరిని అభివృద్ధి చేయాలి



రత్నగిరి ప్రాంతాన్ని ఏళ్ల చరిత్ర ఉంది. రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మిని దర్శించుకునేందుకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. అయితే వారి సౌకర్యార్థం సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నిరుత్సాహంతో వెనుదిరుగుతుంటారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు చారిత్రక ప్రదేశమైన రత్నగిరిని అభివృద్ధి చేయాలి.

– గోవిందరాజు, గుడ్డగుర్కి గ్రామం, రొళ్ల మం

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

లేపాక్షి: స్థానిక లేపాక్షిలోని ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మణిశరన్ మెమోరియల్ ట్రస్ట్, ఎంహెచ్‌ఈడబ్ల్యూహెచ్ఎస్ నిర్వాహకులు కేవీ చలపతి ఆధ్వర్యంలో కిమ్స్ సవేరా, పుష్పగిరి నేత్రాలయ సౌజన్యంతో ఉచిత కంటి, గుండె వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది వైద్య శిబిరానికి హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాసులు, బంగారు చంద్ర, ఇమ్రాన్‌ఖాన్, సాహిద్, అఖిలరాజు, ఆదిత్యశ్రీనివాస్, అబిడ్, షమీం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు మహిళకు ఘన నివాళి



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: తొలి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ దేశానికి ఎనలేని సేవలు చేసి, ఉక్కు మహిళగా నిలిచారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలాజీ మనోహర్, అమానుల్లా, రవూఫ్, జమీల్, మహబూబ్, ఫయాజ్, అజ్మతుల్లా, తిరుపాల్, అయాజ్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

మడకశిరరూరల్: మండలంలోని బుళ్లసముద్రం గ్రామ సచివాలయం వద్ద సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రంగమ్మ, ఎంపీపీ కవిత తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామాల ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని బీజీ హళ్లి సచివాలయ ఆవరణలో సోమవారం ఉదయం 11 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' (ఏపీకి జగనే సీఎం ఎందుకు కావాలంటే) అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ సదాశివప్ప, ఈఓఆర్డీ క్రిష్టప్ప తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జెడ్పీటీసీతో పాటు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, , వైఎస్సార్‌సీపీ శ్రేణులు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి విగ్రహావిష్కరణలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: కృషితో ఎంతటి కార్యాన్ని అయినా సాధించుకోవచ్చని చాటి చెప్పిన వాల్మీకి మహర్షి చూపిన బాటలో నడుచుకోవాలని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. వాల్మీకి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కొట్నూరు వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించారు. టీఎన్ దీపిక మాట్లాడుతూ వాల్మీకులు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని, ఇందుకు వైఎస్సార్‌సీపీ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం

వాల్మీకి విగ్రహ ప్రారంభోత్సవం సందర్భంగా కొట్నూరు బోయ సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షికి ఘనంగా జ్యోతుల ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు కౌన్సిలర్ మల్లికార్జున, నాయకులు రామక్రిష్టప్ప, శ్రీనివాసులు, క్రిష్టారెడ్డి, శివశంకర్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటి లింగాలకు ప్రత్యేక బస్సులు



కోటిలింగాల యాత్రకు బయలు దేరుతున్న భక్తులు

హిందూపురం: కార్తీక మాసం సందర్భంగా హిందూపురం నుంచి కోటిలింగాలు, అరుణచలం క్షేత్రం దర్శనానికి ప్రత్యేక బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఆదివారం హిందూపురం ఆర్టీసీ బస్టాండ్ నుంచి రెండు ప్రత్యేక సర్వీసులు నడిపిస్తున్నారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌బళ్లాపురం వద్ద ఈషా ఫౌండేషన్, కోటిలింగాల దర్శనానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం హంపన్న తెలిపారు. హిందూపురం, కోటిలింగాలు, ములబాగుల ఆంజనేయస్వామి, బంగారు తిరుపతి దేవస్థానాలను చూపించడం జరుగుతుందన్నారు. ఇందుకు రూ.650 చార్జీ ఉంటుందన్నారు. అలాగే ఆదివారం సాయంత్రం అరుణచలం క్షేత్ర దర్శనంకు కూడా ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామన్నారు. దర్శనానికి తరలివెళ్లే వారు ఫోన్ నంబర్ 9440834715కు ఫోన్ చేసి టికెట్లు రిజర్వు చేసుకోవాలన్నారు.

సంక్షేమాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



పళారం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

గుడిబండ: గుడిబండ మండలం సచివాలయం–2 పరిధిలోని పళారం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గత నాలుగున్నరేళ్ల పాలనలో చేసిన మంచిని వివరించారు. సంక్షేమ పథకాలు అమలుతో పాటు అభివృద్ధి ఏ విధంగా చేశారో పేర్కొన్నారు. ప్రభుత్వ మంచిని చూసి మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. రానున్న రోజుల్లో మరింతగా ప్రజలకు మేలు జరగాలంటే మరోమారు వైఎస్ జగన్‌కు పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సతీష్ , వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లు, పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలకు 30 మంది ఎంపిక



మందులు అందిస్తున్న డాక్టర్ దినకర్

రొళ్ల: మండల కేంద్రంలోని గుడిబండ ప్రధాన రోడ్డు పక్కనున్న పాఠశాల ఆవరణలో దివంగత డాక్టర్ నరసింహప్ప జ్ఞాపకార్థం ఆయన తనయుడు డాక్టర్ దినకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ దినకర్‌తో పాటు వైద్యులు సందీప్, సురేష్, దేవగిరి తదితరులు చిన్న పిల్లలతో పాటు గుండె, కంటి సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. 80 మంది కంటి సమస్యలు ఉన్న రోగులను పరీక్షించగా 27 మందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. ముగ్గురికి గుండె సమస్య ఉన్నట్లు గుర్తించారు. కంటి శస్త్ర చికిత్స కోసం ప్రత్యేక బస్సులో నంద్యాల శాంతిరామ్ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ అధికారులకు సూచించారు. పట్టణంలోని శిరా రోడ్డులో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేశ్ మాట్లాడుతూ పది కాలాల పాటు మన్నిక ఉండేలా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మానం వెంకటస్వామి, ఏఈఈ అనిల్ కుమార్, మున్సిపల్ సభ్యులు సుదేశ్ బాబు, టెంకాయల రవి, రాజేశ్, గుట్టహళ్లి అంజినప్ప, గొర్తి నాగరాజు ఉన్నారు.

సత్యసాయి చిత్రపటం ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రొద్దం: సత్యసాయి జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగించారు. భక్తి గీతాలు ఆలపిస్తూ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సత్యసాయి సేవాసమితి సభ్యులు, భక్తులు, బాలవికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కలు బాబోయ్ కుక్కలు



రొద్దం ప్రధాన రహదారిపై కుక్కల గుంపు

రొద్దం: నియోజకవర్గ వ్యాప్తంగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో చికెన్, మటన్ సెంటర్ల వద్ద, చేపల దుకాణాల వద్ద హల్‌చల్ చేస్తున్నాయి. ఒంటరిగా వచ్చే వారితో పాటు వాహనాలపై వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. రోడ్డుకు అడ్డంగా రావడంతో పలువురు వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి ఘటనల్లో పలువురు మృత్యువాత పడిన సంఘటనలూ ఉన్నాయి. కుక్కల నియంత్రణపై సంబంధిత అధికారులు చొరవ చూపకపోవడంతో వాటి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోందని ప్రజలు వాపోతున్నారు.

13 మందిపై కుక్కల దాడి

రొద్దం మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో ఇటీవల 13 మందిపై కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. కుక్కల మూలంగా వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురువుతున్నారు. గ్రామాల్లో పిల్లలు, పెద్దలను గాయపరుస్తున్నాయి. గతంలో పంచాయతీ అధికారులు కుక్కలను వేటాడేందుకు పలు కార్యక్రమాలు చేపట్టే వారు. ప్రస్తుతం జంతు సంరక్షణ సంఘాల కారణంగా వాటి జోలికి వెళ్లడం లేదు.

రోడ్లపై రావడం కష్టంగా మారింది

రోడ్ల మీద నడవడానికే భయం వేస్తోంది. గొర్రెల మందల మాదిరిగా 10 నుంచి 15కి పైగా కుక్కలు ఒకసారిగా దాడి చేస్తున్నాయి. వాటికి భయపడి బయటకు వెళ్లాలంటే కష్టంగా ఉంది. పెంపుడు జంతువులు, కోళ్లను కూడా చంపి తినేస్తున్నాయి. కుక్కల పెరుగుదలను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- బాబు, రొద్దం

రోడ్డుకు అడ్డంగా వస్తున్నాయి

రొద్దం మండల కేంద్రంలోని ప్రధాన రహదారితో పాటు ప్రధాన కూడళ్లలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు కుక్కల గుంపులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే గ్రామంలో అనేక మంది కుక్కకాటుకు గురయ్యారు.

- తిప్పక్క పెద్దకోడిపల్లి

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



చిలమత్తూరు: విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



హిందూపురం: ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి మల్లికార్జున తెలిపారు. సోమవారం విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. అలాగే ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

హిందూపురం టౌన్: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీధర్, సిబ్బంది గుణప్రియ, పాఠకులు పాల్గొన్నారు.

లేపాక్షి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శాఖా గ్రంథాలయం లేపాక్షిలో ఆదివారం ఉదయం మాజీ ప్రధాని మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జయసింహరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదుకు అవకాశం

పావగడ: స్థానిక విధాన సభ క్షేత్రం వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటరు జాబితా విశేష సంక్షిప్త పరిష్కారం-2024 అభియానను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వరదరాజు ఓ ప్రకటన లో తెలిపారు. డిసెంబర్ 9వ తేదీ వరకూ కొనసాగే అభియానలో భాగంగా కొత్త ఓటరు పేరు నమోదు, ఉపసంహరణ, సరిదిద్దడం , మార్చుకోవడం వంటి వాటికి అవకాశం ఉంటుందన్నారు. స్థానికంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

మడకశిరరూరల్: మండలంలోని మెళవాయి గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తలు చేపట్టినట్లు సర్పంచ్ రంగనాథ్ తెలిపారు. ఆదివారం మెళవాయి తిమ్మప్పస్వామి ఆలయం వద్ద జేజేఎం పథకం ద్వారా వేసిన వాటర్ స్కీమ్ బోరులో మంచి నీరు సమృద్ధిగా లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మోటార్ అమర్చి పైపులైన్ ద్వారా గ్రామంలోని కొళాయిలకు తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. అదే విధంగా పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులకు నీటి సమస్య ఉండదన్నారు. బోరులో నీరు సమృద్ధిగా లభించడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.